

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 21 పుష్పం :26,29 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-2-99, చించినాడ)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈ సృష్టిని సృజించే వాడిని బ్రహ్మ అని, ఈ సృష్టి కార్యాన్ని నిర్వర్తించే వాడిని విష్ణువు అని ఈ సృష్టిని లయం చేసేవాడు శివుడు అని మనం ఈ ముగ్గురిని ఆరాధిస్తాము.భగవంతుడు ఒక్కడే. ఉన్న వస్తువు ఒక్కటే. బ్రహ్మద్వారా, విష్ణువు ద్వారా, శివుడు ద్వారా చేసేది భగవంతుడే అని మనం గుర్తించాలి. భగవంతుడు అంతటా ఉన్నాడు. మన అందరి హృదయాలలో ప్రవేశించి ఉన్నాడు. రమణమహర్షి గారిని మీరు ఎవరు అంటే నేను నేనే అని చెప్పేవారు. నేను అంటే ఆత్మ అది నేనే అని చెప్పటం. నేను అంటే మనం దేహగతమైన నేను అనుకొంటున్నాము. జ్ఞానికి దేహగతమైన నేను నశిస్తుంది, ఆత్మగతమైన నేను ఉదయిస్తుంది. నేను నేనే అంటే అర్థం ఏమిటి అంటే ఆత్మే నేను, బ్రహ్మమేనేను అని అర్థం. ఎవరు ఏపని చేస్తున్నారో ఆ పని మీద ప్రేమ, భక్తి లేకపోతే వారు తరించరు. మనం చేసిందే మనకు ఎదురు వస్తుంది.

స్వార్థపరులకంటే స్వార్థంలేని వారికి ఈ లోకం ఎంతో అందంగా కనిపిస్తుంది అని వివేకానంద చెప్పారు. బాగా స్వార్థపరులకు ఈలోకం అంత అందంగా కనబడదు, స్వార్థం లేనివారికి చాలా అందంగా కనబడుతుంది. ఆ సౌందర్యమును చూసే దృష్టి లేనప్పుడు సౌందర్యం కూడా కనబడదు. స్వార్ధం లేని వారికి ఈ లోకం సౌందర్యంగా కనబడటానికి కారణం ఏమిటి అంటే ఈ ప్రపంచం ఉంది కాబట్టి అందులో మనం ఉన్నాము కాబట్టి ఇతరులకు సహాయం చేయగలుగుతున్నాము. ప్రపంచం లేకపోతే ఇతరులకు సహాయం చేయలేము. ఇతరులకు సహాయం చేయటం వలన కదా మనం బాగుపడేది. లోకం ఉండటం వలన ఇతరులకు సహాయం చేస్తున్నాము గాని లోకం లేకపోతే ఎవరికి సహాయం చేస్తాము అని స్వార్థంలేని వాడు అనుకొంటాడు. అందువలన వాడికి ఈలోకం ఎంతో సుందరంగా కనిపిస్తుంది. స్వార్థపరులకు వారి తిండి, బట్ట తప్పించి, వారి పేరు తప్పించి ఇంకో గొడవ ఏమి ఉండదు. ఇలా దేహంచుట్టు తిరుగుతూ ఉంటారు. వారికోసమే వారు పూజలు చేసుకొంటారు. సామాజిక స్పృహ ఉండదు. ఈశ్వరుని మీద ప్రేమ ఉండదు, మోక్ష కాంక్ష ఉండదు. కష్టం కష్టం అనుకొంటే మోక్షం ఎలా వస్తుంది. కష్టం కష్టం అనుకొంటే ఆ పని మీద ప్రేమ లేదు అని అర్థం. ఎవరు ఏ పని చేస్తున్నారో ఆ పని మీద ప్రేమ ఉండాలి. చేసే పని భక్తి పూర్వకంగా, ప్రేమ పూర్వకంగా చేయాలి.

ఈ నామాన్ని స్మరిస్తేనే మోక్షం వస్తుంది, ఈ రూపాన్ని ఆరాధించుకొంటేనే మోక్షం వస్తుంది అని చెప్పేవారికి తత్వం తెలియదు అని అర్థం. అసలు వస్తువుకు నామం లేదు, రూపం లేదు. ఎవరు ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నారో ఆ మార్గంలో వారు ప్రేమగా, ప్రీతిగా ప్రయాణం

చేస్తూ ఉంటే వారిని ఆ మార్గంలో ప్రోత్సాహం చేసి సత్యవస్తువును పొందేటట్లు చేయాలి గాని ఉన్నదానిని చెడగొట్టకూడదు. మీరు ఏదో ఒక రూపాన్ని, నామాన్ని ఆరాధించుకోవచ్చు. మీరు ఆరాధించేది ఒక్కటే నిజం. మిగిలినది నిజం కాదు అనుకోవటం గుడ్డివారు ఏనుగు కథ లాంటిది. ఒక గుడ్డివాడు ఏనుగు చెవి పట్టుకొని ఏనుగు అంటే ఎలాగో ఉంటుంది అనుకొన్నాను చేటలాగ ఉంది అన్నాడట. ఇంకో గుడ్డివాడు ఏనుగు కాలు పట్టుకొని ఏనుగు అంటే ఎలాగో ఉంటుంది అనుకొన్నాను స్తంబంలాగ ఉంది అన్నాడట. వారు ఏనుగు గురించి ఎలా అనుకొంటున్నారో తత్వం తెలియనప్పుడు మన పరిస్థితి కూడా అంతే, భగవంతుడి గురించి అలాగే అనుకొంటాము. భగవంతుడు శక్తి గురించి మనకు తెలియటం లేదు. ఇన్ని కోట్లాది జీవులు ఉన్నాయి. ఎవరిని ఎక్కడకలపాలో, ఎవరికి ఏ అనుభవం కలుగ జేయాలో ఇది అంతా చేసేది భగవంతుడే. ఆయన శక్తిని మనం ఎక్కడ ఊహించగలము. వేదాంత పుస్తకాలు చదివి మోక్షం వస్తుంది అని తొందరపడి అనుకోవద్దు. మనకు సంసాంసుఖం తెలుస్తోంది గాని మోక్షసుఖం తెలియటం లేదు. ఈ సంసార సుఖం నుండి బయటపడి మోక్షసుఖం పొందాలి అనే కాంక్ష తనంతట తానుగా హృదయంలో నుండి ఎవరికైతో వస్తుందో, మోక్షం కోసం చేసే ప్రయత్నం కష్టం అనుకోకుండా ఎవడైతే ప్రేమగా, ప్రీతిగా చేస్తున్నాడో వాడు మోక్షాన్ని పొందుతాడు. నిష్కామకర్మ, నిష్కామభక్తి వలన మోక్షం వస్తుంది. భగవంతుని ఆజ్ఞను ఎవరైతే అనుసరిస్తున్నారో, భగవంతుడు చెప్పిన మాటను అర్థంచేసుకొని, గౌరవించి, ఆచరిస్తున్నారో వారికి మోక్షం వస్తుంది.

వివేకానంద ఒక మీటింగులో మాట్లాడుతూ మీకు అందరికీ నేను ఎందుకు మంచి చేయాలి. నాబాగు నేనే చూసుకోవచ్చు కదా మీకు అందరికి ఎందుకు మంచి చేయాలి, మంచిమాటలు చెప్పాలి అని అడిగాడు. అలా ఎందుకు చేస్తున్నాను అంటే మీకు చేసే మంచి, మీకు చేసే ఉపకారం భగవంతుడు తిరిగి నాకే ఇస్తాడు అని తెలుసు కాబట్టి చేస్తున్నాను అని చెప్పాడు. నీవు సన్యాసివా, గృహస్థుడివా అనేది ముఖ్యంకాదు. నీవు సన్యాసివి అయినా, గృహస్తుడివి అయినా మోక్షం పొందకుండా అడ్డు వచ్చేది దేహాభిమానమే. నీకు మోక్షం పొందటానికి ఏది అడ్డువస్తోందో దానిని తొలగించుకో. నీ మాట ద్వారా, చేత ద్వారా, ఆలోచన ద్వారా దేహాభిమానాన్ని తగ్గించుకొంటూ వస్తే నీవు సన్యాసిగా ఉన్నా , గృహస్తుడుగా ఉన్నా మోక్షాన్ని పొందుతావు. నీవు గృహస్థాశ్రమం లోనుండి బ్రహ్మచర్యాశ్రమంలోనికి, బ్రహ్మచర్యాశ్రమంలోనుండి సన్యాసాశ్రమం లోనికి ఇలా తలంపులను మార్చుకొంటున్నావు గాని తలంపులను విడిచి పెట్టటానికి ప్రయత్నం చేయటం లేదు. పరిసరాలు మార్చుకోవటం, తలంపులను మార్చుకోవటం ముఖ్యంకాదు. తలంపులనుండి విడుదలపొందటం ముఖ్యం. ఎందుచేతనంటే తలంపే నిన్ను బందిస్తోంది. తలంపు లేకపోతే ఏది లేదు.

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 2-3-99, చించినాడ)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా!**

మౌనమే నిజమైన ఉపదేశం. మౌనం అంటే ఎక్కడయితే మనస్సు అణిగిందో అక్కడ మౌనస్థితి కలుగుతుంది. కొంతమందికి మెదడులో కొన్ని కోణాలు వికశించి ఉంటాయి. కొన్ని కోణాలు చీకటిగా ఉంటాయి. అలా కాకుండా అన్ని కోణాలు వికశించి ఉంటే వాడిని పూర్ణమానవుడు అంటారు. మెదడులోని అన్ని కోణాలు వికశించి ఉంటే వాడి మనస్సు

అణుగుతుంది. మనస్సు అణిగితేనేగాని మౌనం కలుగదు. మౌనస్థితి వస్తేగాని హృదయంలో ఉన్న జ్ఞానం మీకు అందదు. మనకు ఉన్నది విషయజ్ఞానం, జ్ఞానికి ఉన్నది ఆత్మజ్ఞానం. విషయజ్ఞానానికి పరిమితులు ఉంటాయి. ఆత్మజ్ఞానానికి పరిమితులు ఉండవు. ఆత్మనీకు అనుభవంలోనికి వచ్చేవరకు నీకు భ్రాంతి కలుగుతుంది, భ్రాంతిలోనుండి భయం వస్తుంది. భయంలోనుండి దు:ఖం వస్తుంది. ఇదే సంసారం. ఆత్మజ్ఞానం కలిగితే గాని భ్రాంతిలోనుండి నీవు బయటపడలేవు. ఉన్నది ఒక్కటే, అది నీవే అనే అనుభవం నీకు వచ్చినప్పుడు మోహపడటానికి, భ్రాంతిపడటానికి నీకు వేరుగా ఏమీ లేదు. అప్పుడు భయం లేదు, దు:ఖం లేదు. మౌనస్థితి నుండి వచ్చే సందేశం అర్థంచేసుకోవటానికి ఎంతో కొంత పవిత్రత ఉండాలి. మనకు అర్హత లేనపుడు, యోగ్యత లేనప్పుడు ఈశ్వరుడే శరీరం ధరించి వచ్చినప్పటికి మనం ఆయనను గుర్తించలేము. సాధనాబలం లేనప్పుడు మౌనం అర్థంకాదు. మౌనం వారికి అర్థం కావటం లేదు అని గురువు గుర్తించి అప్పుడు మాటచెపుతాడు. గురువు చెప్పేమాట అది మాటకాదు, అది అనుగ్రహమే ఎందుచేతనంటే లోపల ఉన్న ఆత్మనుండే ఆ మాట వస్తోంది. అది మాట కాదు అది అనుగ్రహమే అని గుర్తించటానికి పూర్వపుణ్యం ఉండాలి. ప్రపంచంలో చాలా పాపాలు ఉన్నాయి. కాని మానవుడిలో ఉన్న మూర్ఖత్వం, స్వార్థం ఇవే పెద్దపాపాలు. నీవు మూర్ఖత్వంగా ఉన్నా, స్వార్థపరత్వంగా ఉన్నా గురువు చెప్పే మాటలు అందుకోలేవు.

మన శరీరం ఏదో కాలంలో వచ్చింది. ఏదో కాలంలో చనిపోతుంది. మరల ఇంకో కాలంలో వస్తుంది, ఇంకో కాలంలో చనిపోతుంది. కోరిక ఉన్నంత కాలం కాలానికి బద్ధుడై ఉండవలసిందే. ఎవడైతే కామాన్ని జయించాడో వాడు కాలాన్ని జయించగలడు కాని కామాన్ని జయించలేనివాడు కాలాన్ని జయించలేడు. కామాన్ని కాలన్ని జయించలేనివాడు ఆత్మానుభవాన్ని పొందలేడు. పనిని, బాధ్యతను విడిచిపెట్టటంవలన సోమరితనం వస్తుంది. పనిచేస్తూ, బాధ్యత వహిస్తూ జ్ఞానసముపార్జనకు ప్రయత్నంచేయాలి. కర్మచేయుటం ద్వారా కూడా మనం పొందవలసిన అనుభవాలు ఉంటాయి. మనకు అనుకోని సంఘటనలు ఎదురవుతూ ఉంటాయి. అప్పుడు గురువును, భగవంతుడిని తిడతాము. ఆ సంఘటనల ద్వారా నీవు నేర్చుకోవలసినవి ఉంటాయి. ఈ జన్మలో నీవు నేర్చుకోకపోతే రాబోయే జన్మలో అయినా ఆ సంఘటనలు చూపిస్తే గాని నీవు పాఠాలు నేర్చుకోలేవు. సంఘటనలు నీవు అనుకొన్నట్లు జరుగుతూ ఉన్నా, అనుకోని సంఘటనలు నీకు ఎదురైనా ఇవి అన్ని మిధ్యానేనుకే. జీవితం సుఖంగా వెళితే మంచి స్వప్నం, సుఖంగా వెళ్ళకపోతే చెడ్డ స్వప్నం. అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే. చైతన్యానికి మంచీ లేదు, చెడ్డాలేదు, అదృష్టంలేదు, దురదృష్టంలేదు. ఇవి అన్నియూ మనస్సుకే. మనస్సు ఎంత నిజమో ఇవి అన్నికూడా అంతే నిజం. బ్రహ్మంకు ప్రయాణం లేదు. బ్రహ్మానుభవం నీకు లేనప్పుడు జీవుడు ప్రయాణం చేస్తాడు. జీవుడు ఉన్నంత సేపు నీ దేహం నిజమే, లోకం నిజమే, పూర్వజన్మనిజమే, పునర్జన్మనిజమే, పుణ్యం నిజమే, పాపం నిజమే, నీవు వెళ్ళే స్వర్గలోకం నిజమే, నరకలోకం నిజమే. జీవుడు ఎంత నిజమో ఇవి అన్నికూడా అంతే నిజం. ఇవి అన్నీ వ్యవహారికసత్యములే గాని పారమార్థిక సత్యములు కావు. పారమార్థిక సత్యం బ్రహ్మం ఒక్కటే, అది నీవే. అది నీకు అనుభవంలోనికి తీసుకొని రావటానికే కొన్ని కొన్ని అనుకోని సంఘటనలు ఎదురవుతూ ఉంటాయి. వాటి ద్వారా నీ మనస్సుకు అంతర్దృష్టి కలిగించటానికి, నీ మనస్సుకు ట్రైనింగ్ ఇవ్వటానికి నీవు ఊహించని సంఘటనలను ఈశ్వరుడు పంపిస్తూ ఉంటాడు.

నీకు బ్రహ్మానుభవం కలిగే రోజు దగ్గరకు వచ్చినప్పుడు దానికి సంబంధించిన కొన్ని అనుభవాలు కలుగుతాయి. నీవు వాటిని రుచి చూడటం వేరు, శాశ్వతానుభవం కలగటం వేరు. వాసన వేరుతో సహా నశిస్తేనే గాని నీవు అందులో శాశ్వతంగా ఉండలేవు మన మనస్సును ఎప్పుడూ దైవానికి సంబంధించిన వాతావరణంలో ఉంచుకొనేలా చూసుకోవాలి. అప్పుడు మనకు దైవత్వం అందుతుంది. మూలతలంపు నశించినప్పుడు వాడు మోక్షానికి వెళ్ళటంకాదు, మోక్షంలో ఉంటాడు అని కాళిదాసు చెప్పాడు. ఉండేది చైతన్యం, వెళ్ళేవాడు జీవుడు. నాకు ఏకాగ్రత కుదరటంలేదు, పవిత్రత సాధించలేక పోతున్నాను అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగితే నీవు ఏకాగ్రత, పవిత్రత సాధించలేక పోతున్నాను అని చెబుతున్నావు అలాగే. నీకు ఏకాగ్రతకుదరటానికి, పవిత్రుడవు అవ్వటానికి అనుగ్రహం అవసరం. ఏకాగ్రత, పవిత్రత సాధించటానికి నీకు శక్తి చాలటంలేదు. ఆ శక్తిని ఇచ్చి నీవు ఏదైతే పొందాలో దానిని పొందింపజేసేదే అనుగ్రహం.

కర్మను బట్టి జన్మ వస్తుంది. అంటే పూర్వజన్మలో మనం చేసిన కర్మను బట్టి ఈ జన్మ వచ్చింది. అసలు మొట్టమొదట జన్మ ప్రారంబమయినప్పుడు ఏ కర్మవలన అది ప్రారంభమయింది అని చాలా మంది అడుగుతారు. మీరు సినిమాకు వెళ్ళినట్లు స్వప్నం వచ్చింది అనుకోండి మెలుకువ వచ్చాక ఏటైములో సినిమాకు వెళ్ళాము, ఏ సినిమాకు వెళ్ళాము అని ఆలోచిస్తారా? దాని గురించి ఆలోచించరుఎందుచేతనంటే మెలుకువ వచ్చాక స్వప్నం అనత్యం అని మీకు తెలుస్తుంది. అలాగే బ్రహ్మానుభవం కలిగాక ఈ జన్మలు, కర్మలు అసత్యం అని మీకు తెలుస్తుంది. అప్పుడు మొదలు గురించి ఎవ్వరూ అలోచించరు. అసలు ఈ కర్మలు జన్మలు ఎవరికి అంటే నాకు అంటే నాలో ఏదైతే నేనుగా వ్యక్తమవుతుందో దానికి కర్మలు, జన్మలు. అది ఉంటే ఇవి అన్నీ ఉన్నాయి అది లేకపోతే ఏదీ లేదు.

మీలో కొంతమందికి ధనం ఉండవచ్చు, కొంతమందికి ధనం లేకపోవచ్చు. కొంతమంది అందంగా పుట్టవచ్చు. కొంతమందికి అందంలేకపోవచ్చు. కొంతమందికి చదువు ఉండవచ్చు, కొంతమందికి చదువు లేకపోవచ్చు. ఇవి అన్నీ ప్రారబ్దాన్ని బట్టి వచ్చాయి గాని బ్రహ్మమునకు దీనికి ఎట్టి సంబంధం లేదు. నీవు మాయతో తాదాప్యం చెందటం వలన నీకు దు:ఖం వస్తోంది. ధనంతోటి చదువుతోటి అందంతోటి తాదాప్యం పొందేది నీ అహంభావనే. అది ఎంత అసత్యమో ఇవి కూడా అంతే అసత్యం. మీరు ఎప్పుడూ బ్రహ్మమే. మీరు బ్రహ్మభావనను పోషించుకొంటూ ఉంటే బాహ్యమైన సంఘటనలు ఏవి కూడా మిమ్మల్ని చలింపజేయలేవు.

---

**సద్గురు శ్రీనాన్నగారి క్యాంపులు**

23-5-99 నుండి 30-5-99 వరకు సద్గురు శ్రీనాన్నగారు విశాఖపట్నం క్యాంపు

09-6-99 నుండి 23-6-99 వరకు సద్గురు శ్రీనాన్నగారు లండన్ పర్యటన

**సద్గురు శ్రీనాన్నగారి ప్రవచనములు**

24-5-99 క్షత్రియ కళ్యాణమంటపం, సీతమ్మధార, విశాఖపట్నం

03-6-99 క్షత్రియ కళ్యాణమంటపం, పాలకొల్లు

27-6-99 వై.ఎన్. కాలేజి ఆడిటోరియం, నర్సాపురం

---

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL. ☎ 24776